## క్లుప్తంగా

### బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి


ఎస్సై వెంకటేష్

కొత్తపల్లి: దీపావళికి విక్రయించే బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఎస్సై వెంకటేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచా నిల్వ చేసినా, తయారు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. బాణసంచా తయారు చేసేవారికి కచ్చితంగా లైసెన్స్ ఉండాలన్నారు. జనావాసాల మధ్య, రద్దీ ప్రాంతాల్లో దుకాణాలు ఉంచరాదన్నారు. నివాస గృహాల్లో ఎక్కడైనా బాణసంచాను అక్రమంగా నిల్వ చేసినా, తయారు చేసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు అగ్నిమాపక, తహసీల్దార్, పోలీసులు, పొల్యూషన్ శాఖలకు సంబంధించిన అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా షాపులను ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ ప్రమాదం సంభవించినా దానికి పూర్తి బాధ్యత నిర్వాహకులే వహించాలన్నారు. దుకాణాల ఏర్పాటుకు వీఆర్వో, పోలీసులు పరిశీలన చేసిన తర్వాతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతులు మంజూరు చేస్తారన్నారు.

### మరిడమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

పెద్దాపురం(సామర్లకోట): ప్రసిద్ధిచెందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతైన రోజు కావడంతో ఆలయ ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సమావేశ మందిరంలో ఆలయ పండితులు పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు.

### ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న నరసింహారావు

సామర్లకోట: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది వేడుకలు ఆదివారం సాయంత్రం స్థానిక కొత్తూరులోని ప్రతిభా విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో జరిగాయి. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వందేళ్లలో ఆర్ఎస్ఎస్ దేశానికి అందించిన సేవలను పెద్దాపురం ఖండ సంఘ సంచాలక్ బిక్కిన సాయిపరమేశ్వరసాయి సత్యనారాయణ, ప్రాంత పరివారణ్ ప్రముఖ్ చదరం నరసింహారావు వివరించారు. ఆధ్యాత్మికతతో పాటు, దేశభక్తి పెంచడానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### జూదరుల అరెస్ట్


గురజనాపల్లిలో నిందితులను అదుపులోకి తీసుకుంటున్న ఎస్సై సునీత

కరప: పేకాట శిబిరంపై దాడి చేసి పది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్టు కరప ఎస్సై టి.సునీత తెలిపారు. వారి నుంచి రూ.14,570 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. గురజనాపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందడంతో ఆదివారం తన సిబ్బందితో కలిసి ఎస్సై సునీత దాడి చేశారు. జూదరులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్టు తెలిపారు. నిందితులను సోమవారం కాకినాడ కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

### దాడిలో ఇద్దరికి గాయాలు

కరప: ఎందుకు గొడవ పడ్డారని అడిగేందుకు వెళ్లిన ఇద్దరు సోదరులపై వంట చేసే కురుపీతో దాడి చేసి గాయపర్చిన ఉదంతమిది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సునీత తెలిపారు. ఆమె వివరాలు మేరకు, కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామానికి చెందిన గురి మోహన్‌కుమార్ తన పుట్టిన రోజు సందర్భంగా శనివారం రాత్రి స్నేహితులతో కలిసి కరప మండలం గురజనాపల్లిలోని కోళ్ల ఫారం వద్ద పార్టీ చేసుకున్నారు. పార్టీలో ఉండగా మోహన్‌కుమార్ తనకు వరుసకు సోదరుడైన యాసలపు రోహిత్‌ను బిర్యానీ తీసుకురమ్మని తూరంగి పంపాడు. అతడు బిర్యానీ తెస్తుండగా.. నడకుదురు ఆంజనేయస్వామి గుడి వద్దకు వచ్చేసరికి కొందరు రోడ్డుకు అడ్డుగా ఉండి రోహిత్‌తో గొడవపడ్డారు. విషయం తెలుసుకుని మోహన్‌కుమార్ అక్కడకు వెళ్లాడు. రోహిత్‌తో గొడవ పడిన నాగేంద్ర ఇంటికెళ్లి అడుగుతుండగా.. అతడు వంట చేసే కురుపీతో సోదరులిద్దరినీ కొట్టాడు. ఈ దాడిలో మోహన్‌కుమార్, రోహిత్‌కు తల, చేతులపై గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితుడు మోహన్‌కుమార్ ఆదివారం కరప పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# చిరాకుపోకలు..!

- కాకినాడ-సామర్లకోట రోడ్డు విస్తరణ ఎప్పుడో?
- అసలే ఇరుకు రోడ్డు.. ఆపై మార్జిన్‌లో చెత్తాచెదారం
- ఏలేరు, గోదావరి కాలువల పూడికలూ రోడ్డుపైనే..
- ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయ లోపం


అడుగడుగునా గండమే !: సామర్లకోట-కాకినాడ రోడ్డులో ఏర్పడిన గోతులు

సామర్లకోట: నిత్యం ఉమ్మడి జిల్లాలో వేలాది మంది కాకినాడకు రాకపోకలు సాగిస్తుంటారు. సామర్లకోట-కాకినాడ ప్రధాన మార్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. ఓ వైపు గోదావరి కాలువ, మరోవైపు వెస్ట్ ఏలేరు కాలువలున్నాయి. గోదావరి కాలువ, వెస్ట్ ఏలేరు డ్రెయిన్‌లో పెరిగిన గుర్రపుడెక్క, తూటికాడను తొలగించిన సమయంలో వ్యర్థాలను రోడ్డు మార్జిన్‌లో వేస్తున్నారు. దీనికితోడు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు పెరిగిపోవడం వల్ల సామర్లకోట-కాకినాడ రోడ్డు మరింత ఇరుకుగా మారిపోతుందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు వచ్చిన సమయంలో రోడ్డుపై ముంపు నీరు గోదావరి కాలువ, వెస్ట్ ఏలేరు కాలువలోకి పోయేందుకు అవకాశం ఉండేది. ఇటీవల ఇరిగేషన్ అధికారులు ఇరువైపులా ఉన్న గోదావరి కాలువ, ఇరిగేషన్ కాలువలోని గుర్రపు డెక్కలను రోడ్డు మార్జిన్‌లో వేశారు. దాంతో వర్షపు నీరు పోయే మార్గం స్తంభించింది. రోడ్డుపై నీరు నిలిచిపోయి రోడ్డుకు నష్టం ఏర్పడుతుంది. భారీ వాహనాల రాకపోకల సమయంలో రోడ్డుపై తారు వదిలి.. గోతులు ఏర్పడుతున్నాయి. ఆ గోతులు పెద్దగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

**ప్రమాదాలకు నిలయంగా..**

సామర్లకోట-కాకినాడ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. రోడ్డుపై అడుగడుగునా చిన్నా, పెద్దా గోతులు ఏర్పడటంతో ద్విచక్ర వాహన చోదకులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డులో లైట్లు లేకపోవడంతో ఎదురుగా భారీ వాహనాలు వచ్చిన సమయంలో ఇతర ప్రయాణికులకు గోతులు కనిపించడం లేదు. గతంలో భారీ వాహనాలతో పాటు, ప్రతి వాహనానికి హెడ్ లైట్లకు సగ భాగం వరకు నలుపు రంగు ఉండేది. దాంతో ఎదుటి వాహనచోదకుల ముఖాలపైకి ఎక్కువగా లైటింగ్ వచ్చే అవకాశం ఉండేది కాదు. తాజాగా చిన్న వాహనాలతో పాటు, భారీ వాహనాలకూ ప్రకాశవంతమైన ఎల్ఈడీ లైట్లు వేయిస్తున్నారు. దీంతో లైటింగ్ మరింత ఎక్కువగా ఉండి.. ఎదురుగా వచ్చే వాహన చోదకులకు ఇబ్బందికరంగా, ప్రమాదకరంగా మారుతోంది. గోదావరి కాలువ వెంబడి తొలగిస్తున్న చెత్తను తొలగించడానికి ఇరిగేషన్ అధికారులు తమ వద్ద నిధులు లేవని చెబుతున్నారు. ఆర్అండ్‌బీ వారు వేసిన చెత్తను తాము ఎలా తొలగిస్తామంటూ వాదించడం విడ్డూరం. రెండు శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా ధవళేశ్వరం నుంచి మాధవపట్నం వరకు కెనాల్ రోడ్డుకు తూట్లుపడుతున్నాయి. కాలువల వెంబడి ఉన్న చెత్తను తొలగించడం ఆయా పంచాయతీలకు భారంగా మారింది.


కాకినాడ రోడ్డులో అధ్వానంగా గోదావరి కాలువ మార్జిన్

**భయంభయంగా ప్రయాణం**



చిన్న వాహనాలపై కాకినాడ రోడ్డులో ప్రయాణం భయంభయంగా మారింది. ఉమ్మడి జిల్లాలో అనేక రోడ్ల విస్తరణకు నోచుకున్నప్పటికీ.. సామర్లకోట-కాకినాడ కెనాల్ రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. భారీ వాహనాల రాకపోకల సమయంలో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. కొన్నేళ్ల క్రితం ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకు రోడ్డు విస్తరణకు పనులు చేపట్టారు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలతో విస్తరణ పనులు నిలిచిపోయాయి.

– వేగు సత్యనారాయణ, చిరు వ్యాపారి, సామర్లకోట

**రోడ్డు విస్తరించాలి**



జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లడానికి ప్రధాన మార్గం బ్రిటిష్ కాలం నుంచి విస్తరణకు నోచుకోలేదు. సామర్లకోట-కాకినాడ రోడ్డులో ఐదు తూముల వద్ద నుంచి ఉన్న వెస్ట్ ఏలేరు డ్రెయిన్ మీదుగా ఇంద్రపాలెం వరకు వంతెన నిర్మాణం చేయడం ద్వారా రోడ్డు విస్తరించడానికి అవకాశం ఉంటుంది. దాంతో కాలువలు మార్పు చేయాల్సిన అవసరం ఉండదు. కాకినాడ రోడ్డులో అడుగడుగునా గోతులు ఉండటంతో చిన్న వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆటోలు, కార్లు గోతుల్లో పడి మరమ్మతులకు గురవుతున్నాయి.

– ఆవాల లక్ష్మీనారాయణ, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ, సామర్లకోట

### చిరస్మరణీయుడు పద్మరాజు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దొరబాబు


పద్మరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దవులూరి దొరబాబు తదితరులు

పెద్దాపురం(సామర్లకోట): మాజీ వైస్ ఎంపీపీ, మాజీ సర్పంచ్ మిరియాల పద్మరాజు చిరస్మరణీయులని, ఆయన సేవలు మరువలేమని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు కొనియాడారు. పద్మరాజు ఏడో వర్ధంతి సందర్భంగా ఆదివారం మర్లావ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దొరబాబు పాల్గొన్నారు. ఓ రాజకీయ నాయకుని విగ్రహం ఏర్పాటు చేయాలంటే ఆ గ్రామంలోని ప్రజల మన్నలు పొందాలన్నారు. దీనిలో భాగంగా మిరియాల పద్మరాజు విగ్రహం ఏర్పాటు చేయడమే కాకుండా, ఏటా ఆయన వర్ధంతి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

### బాలికను గుర్తించిన పోలీసులు

గండేపల్లి: అదృశ్యమైన బాలికను గుర్తించి ఆమెను తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల మేరకు మండలంలోని సూరంపాలేనికి చెందిన 19 ఏళ్ల బాలిక సెప్టెంబర్ 30న అదృశ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ప్రత్యేక టీమ్‌గా ఏర్పడిన గండేపల్లి ఎస్సై యూవీ శివనాగబాబు సిబ్బందితో కలిసి గాలించారు. నెల్లూరు జిల్లాలో ఆ బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించినట్టు సీఐ తెలిపారు.

# గ్రామీణ రోడ్లపై నరక యాతన


పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

కొత్తపల్లి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలంలో ప్రధాన రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులు వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. రోడ్లపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. దీనికితోడు భారీ వర్షాలకు గుంతల్లో నీరు చేరింది. వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించడానికి నరకం చూస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో లింకు రోడ్లు, బీటీ రోడ్లపై గుంతలు ఏర్పడడంతో రాకపోకలు సాగించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పిఠాపురం–ఉప్పాడ, కొత్తపల్లి–పండూరు, మూలపేట–నాగులాపల్లి, యండపల్లి జంక్షన్–రమణక్కపేట, కొమరగిరి–పిఠాపురం, ఉప్పాడ–పొన్నాడ, ఉప్పాడ–కాకినాడ బీచ్ వెళ్లే రోడ్లు భారీ గుంతలతో ప్రమాదకరంగా మారాయి. నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ఆయా మార్గాల్లో ప్రయాణం సాగిస్తుంటారు. వర్షాలకు రోడ్లపై తారు లేచిపోయి, నీటి గుంతలు ఏర్పడుతున్నాయి. ఫలితంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు అదుపు తప్పి ప్రమాదాలు జరిగిన సంఘటనలు చోటు చేసుకున్నాయని వాహనదారులు చెబుతున్నారు. బాలింతలు, గర్భిణులు, వైద్యశాలలకు ఆటోలో ప్రయణించాలంటే ప్రాణం అరచేతిలో పెట్టుకోవాల్సిన దుస్థితి వచ్చిందని మహిళలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉప ముఖ్యమంత్రి స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**ప్రమాదాలు నివారించాలి**

ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు, కొత్తపల్లి-పండూరు రోడ్లు ఎంతో కీలకమైనవి. కనీసం రోడ్డును పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించాలి. లేనిపక్షంలో పెను ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఆయా రోడ్లలో ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుంది. వర్షం పడితే గోతులన్నీ నీటితో నిండిపోతున్నాయి. రోడ్లకు మరమ్మతులు చేయించి, ప్రమాదాలను నియంత్రించాలి.

– ఆనాల సుదర్శన్, మండల అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ

# మహారాజా సేవలు మరువలేనివి

- ఘనంగా పిఠాపురం మహారాజా జయంతి


పిఠాపురంలో రాజావారి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

పిఠాపురం: విద్యారంగానికి మహారాజా చేసిన సేవలు మరువలేమని పలువురు వక్తలు కొనియాడారు. పిఠాపురం మహారాజా జయంతి సందర్భంగా ఆదివారం పిఠాపురంలో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక పిఠాపురం సీతయ్యగారి తోటలోని ఆదిత్య పాఠశాల ప్రాంగణంలో రాజా కుమార, వెంకట మహీపతి సూర్యరాయ బహదూర్ 140వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటగుమ్మం సెంటర్‌లో పిఠాపురం రాజావారి విగ్రహానికి ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర బృందం పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లాకు రాజావారి పేరు పెట్టాలని నల్లమిల్లి శేషారెడ్డి ప్రతిపాదించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ శృతిరెడ్డి, కవి ర్యాలి ప్రసాద్, కొండేపూడి శంకరరావు, కవి వంశీకృష్ణ, విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆర్.విజయసారధి, కో–ఆర్డినేటర్ వి.రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**గ్రంథాలయంలో..**

పిఠాపురం మహారాజా సూర్యారావు బహదూర్ జయంతి సందర్భంగా స్థానిక శ్రీసూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో రాజావారి చిత్రపటానికి విశ్రాంత మున్సిపల్ కమిషనర్ వెన్నపు చక్రధరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిఠాపురం మహారాజా కాకినాడ జిల్లా సాధన సమితి సభ్యులు భవిష్యత్ కార్యాచరణపై చర్చించి, మహారాజా వారు కాకినాడ జిల్లాకు చేసిన సేవలను గుర్తిస్తూ, విద్యా, వైద్య, సాహితీ రంగాలకు వారు చేసిన దాతృత్వాన్ని తెలిపే కరపత్రాన్ని విడుదల చేశారు. భవిష్యత్ కార్యాచరణపై కాకినాడ జిల్లా ప్రముఖులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు కొండేపూడి శంకరరావు, పెమ్మరాజు సత్యరామచంద్రరావు, అల్లవరపు నగేష్, మధు, కాగిత నాగేశ్వరరావు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# సేవల కోసమే 'లయన్స్' ఆవిర్భావం

- క్లబ్ ఉప గవర్నర్ శ్రీనివాసరావు


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చిటినీడి, డాక్టర్ అమలకంటి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

సామర్లకోట: పేద ప్రజలకు సేవలందించాలనే లక్ష్యంతోనే లయన్స్ క్లబ్ ఆవిర్భావం జరిగిందని క్లబ్ ఉప గవర్నర్ చిటినీడి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత ఎముకలకు సంబంధించిన వైద్య శిబిరాన్ని క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. కై రా ఎమర్జెన్సీ అండ్ ట్రామా సెంటర్‌కు చెందిన వైద్యులు టి.వెంకటభార్గవ్, కర్రి నిరూప, సీహెచ్ అజయ్‌రాకేష్, నంబారు స్నేహ, ఆశా రమ్య శ్రీపాటి వైద్య పరీక్షలు చేశారు. పేద ప్రజలకు సేవలందించడంతో క్లబ్ సామర్లకోట శాఖ ముందజలో ఉందని ఉప గవర్నర్ అన్నారు. ప్రతి ఆదివారం కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. ఎముకలకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు, మహిళలకు సంబంధించిన పరీక్షలు, సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. సుమారు 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. వైద్య సేవలందించిన డాక్టర్లను క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, రీజినల్ చైర్మన్ గంగాధరరావు, క్లబ్ కోశాధికారి ఏలేటి రమేష్, మాజీ అధ్యక్షులు కర్రి ఆదినారాయణరెడ్డి, శివనాగకృష్ణ, విజయకృష్ణ, విజయభాస్కరరెడ్డి, గండు శంకరరావు, బుర్రే కృష్ణమోహన్ తదతరులు పాల్గొన్నారు.

# అమృత మంజరి రెండో భాగం పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేంద్రరావు తదితరులు

కాకినాడ రూరల్: తమిళనాడుకు చెందిన మను జ్యోతి ఆశ్రమం కాకినాడ సభ్యుల ఆధ్వర్యంలో స్థానిక ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో అమృత మంజరి రెండో భాగం తన ప్రేమ గల చేతుల నైపుణ్యం అనే పుస్తక ఆవిష్కరణ ఆదివారం సాయంత్రం జరిగింది. ముఖ్యఅతిథి ఏపీఎస్పీ కమాండెంట్ నాగేంద్రరావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఒకే దేవుడు ఒకే దేశమనే సిద్ధాంతాన్ని అనుసరిస్తూ, భగవంతుడు ఒక్కడనే గొప్ప చైతన్యం తీసుకురావడం అభినందనీయమన్నారు. వేద గ్రంథాలు, పురాణంలోని సారాంశాలను చిన్న పుస్తకాలుగా ముద్రించి, ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు ఆశ్రమ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు లహరికృష్ణ, కేవీఆర్ఎల్ ప్రభాకర్ రావు, రిటైర్డ్ ఆర్ఎస్సై కేవీ రమణ, జె.రామారావు, జి.రాంబాబు, మూర్తి, నారాయణ పాల్గొన్నారు.

# ఉత్సాహంగా కనకదుర్గమ్మ ఊరేగింపు


సామర్లకోటలో కనకదుర్గ ఊరేగింపును ప్రారంభిస్తున్న ఆవాల లక్ష్మీనారాయణ


సామర్లకోటలో కనకదుర్గ అమ్మవారి విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

సామర్లకోట: పట్టణంలోని రైల్వే క్వార్టర్సులో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి ఊరేగింపు ఆదివారం ఉత్సాహంగా సాగింది. శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఏటా రైల్వే క్వార్టర్సులో కనకదుర్గ మండపాన్ని ఏర్పాటు చేసి, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాలు ముగియడంతో అమ్మవారి నిమజ్జన ఊరేగింపును రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ప్రారంభించారు. రైల్వే క్వార్టర్సు నుంచి రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్, సత్యనారాయణపురం, సంపెంగతోట మీదుగా ఊరేగింపు కొనసాగింది. పంచారామ క్షేత్ర ముఖద్వారం వరకు ఊరేగింపు నిర్వహించి, గోదావరి కాలువలో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**

పట్టణంలోని పాత్రుశ వీధిలో నిర్వహించిన శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం కనకదుర్గ అమ్మవారి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఏర్పాటు చేసిన అమ్మవారిఈ ఊరేగింపును వైఎస్సార్ సీపీ అయ్యరక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ పూజలు చేసి ప్రారంభించారు. ఈ ఊరేగింపులో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భారీ బాణసంచా కాల్పులు, బ్యాండ్‌మేళం, వివిధ రకాల డ్యాన్సులతో ఊరేగింపు కొనసాగింది. గరగల నృత్యం ఆకట్టుకుంది. పెద్ద పులి వేషాలు, గుర్రాల వేషాలతో కళాకారులు అలరించారు. కమిటీ నాయకులు పెదిరెడ్ల కృష్ణ, బొడుగు ప్రసాద్, ఎలిశెట్టి శివాజీ, కర్రి ఉమామహేశ్వర రావు, కర్రి విజయ్, రామకృష్ణ, పెదిరెడ్ల రాజు, త్రిమూర్తులు, కర్రి నారాయణ, బెహరా అజయ్ సేవలందించారు.

**ఆకట్టుకున్న వేషధారణలు**

కొత్తపల్లి: దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా మండలంలోని యండపల్లి జంక్షన్‌లో వేంచేసిన కనకదుర్గాదేవి అమ్మవారి ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు దేవతల వేషధారణలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారికి ప్రత్యేక హారతులతో పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేశారు.


ఊరేగింపులో ఆకట్టుకున్న గరగల నృత్యం






కొత్తపల్లిలో శివపార్వతులు, భరతమాత, కృష్ణార్జునుల వేషధారణల్లో అలరించిన కళాకారులు

# అలరించిన నృత్య ప్రదర్శనలు


బీచ్ రోడ్డులో శిల్పారామం వద్ద కళాకారుల నృత్య ప్రదర్శన

కాకినాడ రూరల్: కాకినాడ బీచ్ రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కళాకారులు తమ నృత్యాలతో అలరించారు. జగ్గంపేటకు చెందిన ముళ్లపూడి వెంకటలక్ష్మి, సీతారత్న లలిత కళా నృత్య నికేతన్ బృందం సభ్యులు తమ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కాకినాడ సిటీ, రూరల్‌తో పాటు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు నృత్యప్రదర్శనలు వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శిల్పారామం ఏఓ మోహన్‌తేజ మాట్లాడుతూ, దసరా ఉత్సవాల్లో భాగంగా శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

